క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఉయ్యాలవాడ : మండలంలోని సుద్దమల్ల గ్రామంలో లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ అభయాంజనేయస్వామి ఆలయాల్లో శనివారం అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ చేసి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు కమలేష్ శర్మ, లక్ష్మణస్వామి, భాస్కరశర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



అమ్మిరెడ్డినగరంలో పొలంబడి నిర్వహిస్తున్న ఏఓ

దొర్నిపాడు: రబీలో సాగు చేసిన వరి పంటను చీడపీడల నుంచి కాపాడుకోవడానికి రైతులు పంట యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ సూచించారు. శనివారం మండలంలోని అమ్మిరెడ్డినగరం గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరి పంటలో అగ్గితెగులు, దోమపోటు చీడపీడలను ఎలా నివారించాలో రైతులకు వివరించారు. ప్రస్తుతం వాతావరణ దృష్ట్యా వరిలో ముంపు నీటిని తగ్గించి పొటాష్ ఎరువు పైపాటుగా వేయాలన్నారు. అగ్గితెగులు, పాముపొడ తెగులు నివారణకు లీటర్ నీటికి 1మి.లీ ప్రొఫిన్, కొనజోల్ 25ఈసీ కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు,రైతులు పాల్గొన్నారు.

సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

ఉయ్యాలవాడ : మండలంలోని బోడెమ్మనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వెంకట పునీత్‌రెడ్డి రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖరయ్య తెలిపారు. శనివారం ఈ మేరకు విద్యార్థిని వ్యాయామ ఉపాధ్యాయుడు మౌలాలి, ఉపాధ్యాయులు దక్షిణామూర్తి, కృష్ణారెడ్డి, ఆచారి, శ్రీదేవి అభినందించారు.

20 నుంచి గ్రామ సభలు

శిరివెళ్ల: ఈ నెల 20వ తేదీ నుంచి ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీపై గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శనివారం తెలిపారు. 20న శిరివెళ్ల, బోయలకుంట్ల, కోటపాడు, చెన్నూరు, మోత్కలపల్లె, గ్రామ పంచాయతీలలో సభలుంటాయన్నారు, 21న వీరారెడ్డిపల్లె, 23న గుంప్రమాన్‌దిన్నె, 25న గోవిందపల్లె, 26న జీనేపల్లె, 27న మహదేవపురం, 28న కామినేనిపల్లె, యర్రగుంట్లలలో గ్రామ సభలుంటాయని చెప్పారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందం ఉపాధి పనులు, పింఛన్ల పంపిణీ, పీఆర్, పశు సంవర్ధక శాఖల్లో తనిఖీలు చేస్తున్నారు. అలాగే 29వ తేదీన ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ నివేదికలపై బహిరంగ చర్చ ఉంటుందని వివరించారు.

కొలతల ప్రకారం వేతనాలు ఇవ్వాలి

నంద్యాల(రూరల్): ఉపాధి హామీ పథకంలో భాగంగా పని చేసే కూలీలకు కొలతల ప్రకారం వేతనం అందేలా చూడాలని సీఎల్‌ఆర్‌సీ ఏపీడీ బాలాజీనాయక్ అన్నారు. శనివారం మండలంలోని చాబోలు గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధి కూలీకి రోజుకు రూ. 200 నుంచి రూ.250 దినసరి వేతనం వచ్చేలా పనులు కల్పించాలని చెప్పారు. గ్రామస్థాయి నాయకులు, అధికారుల సమన్వయంతో ఉపాధి పనులు చేపట్టాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీల వివరాలను రికార్డుల్లో పకడ్బందీగా నమోదు చేయాలని ఆదేశించారు. ఏపీఓ శ్రీకళ, ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్ ఉన్నారు.

సీతారాముల విగ్రహాల బహూకరణ



విగ్రహాలకు పూజలు చేస్తున్న దృశ్యం

మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలోని శ్రీ కోదండరామాలయానికి గోపవరం గ్రామానికి చెందిన ఇరగబోయిన పెద్దచెన్నయ్య, చిన్నచెన్నయ్య కుటుంబ సభ్యులు శనివారం విగ్రహాలను బహూకరించారు. శ్రీ సీతా సమేత రామలక్ష్మణులు, ఆంజనేయస్వామి విగ్రహాలకు దాతల ఆధ్వర్యంలో అర్చకులు విశేష పూజలు చేశారు. షోడశోపచార పూజలు, అభిషేకం, అర్చన పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు.

తెగ వాడేస్తున్నారు..

- నంద్యాల డివిజన్‌లో పెరుగుతున్న విద్యుత్ వాడకం
- విద్యుత్ వృథాకు కళ్లెం వేయాలంటున్న అధికారులు

కాలమేదైనా .. విద్యుత్

వినియోగం మాత్రం తగ్గడం లేదు. అవసరమున్నా లేకపోయినా ఫ్యాన్లు, లైట్లు నిరంతరాయంగా వెలుగుతుండటం, మధ్యాహ్నమైందంటే చాలు ఏసీలు వాడటం, కాలాలకు అతీతంగా ఫ్రిజ్ నింతరం ఆన్‌లోనే ఉండటం, వివిధ ఉపకరణాల వినియోగం అధికమవడంతో వినియోగం ఏటేటా పెరిగిపోతోంది. అంతేగాకుండా వృథా తగ్గించాలని విద్యుత్ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నా ఫలితం ఆశించిన స్థాయిలో లభించడం లేదు. ఇందుకు ఎవరికి వారు బాధ్యతగా వ్యవహరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొంటున్నారు.

నంద్యాల: నంద్యాల డివిజన్‌లో విద్యుత్ వాడకం గణనీయంగా పెరిగింది. గతంలో రాత్రి పూట ఎక్కువగా విద్యుత్ వినియోగించేవారు. ఇప్పుడు పగలు, రాత్రి తేడా లేకుండా విద్యుత్‌ను వాడుతున్నారు. గృహాలతో పాటు కమర్షియల్ విభాగంలో కూడా వాడకం పెరిగింది. ఏవో అవాంతరాల వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే సంబంధిత అధికారులను వినియోగదారులు సంప్రదిస్తున్నారు. నంద్యాల డివిజన్‌లో ఫిబ్రవరి నెలలో 7.90 కోట్ల యూనిట్లు విద్యుత్ వాడకం జరగ్గా మార్చి 18 నాటికి 8 కోట్ల యూనిట్లు విద్యుత్‌ను వినియోగించారు. దీన్ని బట్టి విద్యుత్ వినియోగం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో విద్యుత్‌ను పొదుపు చేయాల్సిన అవసరం ఉందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో మరింత ఎక్కువ విద్యుత్ అవసరమవుతుందని, ముందస్తుగా పొదుపు గురించి వినియోగదారులకు అవగాహన కల్పించాలని పేర్కొంటున్నారు. ఏసీలు, ఇతర విద్యుత్ పరికరాల వాడకం పెరగడం వల్ల ఏటా 10శాతం చొప్పున వినియోగం పెరుగుతుందని లెక్కలు తెలియజేస్తున్నాయి.

పరిస్థితి ఇదీ..

ఇంట్లో కావాల్సినంత వెలుతురు ఉంటుంది. అయినా విద్యుత్ దీపాలు వెలుగుతూనే ఉంటాయి. సహజ సిద్ధమైన గాలి చల్లగా శరీరాన్ని తాకుతున్నా.. ఏసీలు ఆపేందుకు ఇష్టపడరు. కళ్ల ముందే ఫ్యాన్లు తిరుగుతున్నా పట్టించుకోరు. ప్రతి నెలా వచ్చే బిల్లును చూసి భయపడతాం. అందుకే వినియోగం తెలుసుకొని బిల్లు భారం తగ్గించుకోవాలని అధికారులు చెబుతున్నారు.

ఇలా చేద్దాం..

- సాధారణ బల్బులకు బదులు సీఎఫ్‌ఎల్ బల్బులు వినియోగించాలి.
- పగటి పూట లైట్ల వినియోగం తగ్గించాలి. అవసరమైనప్పుడు లైట్లు, ఫ్యాన్లు వాడుకొని ఆ తరువాత ఆపివేయడం అలవాటు చేసుకోవాలి.
- ఫ్రిజ్‌ల డోరు ఎక్కువ సార్లు తెరవకపోవడం మంచిది. థర్మోస్టాట్‌ను మీడియంలో ఉంచాలి.
- ఏసీలను 24 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత వద్ద ఉంచుకోవాలి.
- దాని కంటే తగ్గించడం వల్ల 5శాతం విద్యుత్ వృథా అవుతుంది.
- ఏసీ ఫిల్టర్‌ను నెలకొకసారి శుభ్రం చేసుకోవాలి. ఏసీ ఆన్‌లో ఉండగా కిటికీలు, తలుపులు మూసి ఉంచాలి.
- వాషింగ్ మిషన్ ఫుల్‌లోడ్ వద్ద వినియోగించకుండా టైమర్‌ను తక్కువ సెట్టింగ్ వద్ద ఉంచుకోవాలి.
- గీజర్‌కు బదులు సాధ్యమైనంత వరకు సోలార్ వాటర్ హీటర్లను వాడాలి.
- ఎలక్ట్రిక్ స్టౌవ్‌లకు బదులు మైక్రోవేవ్ ఓవెన్ వాడటం ద్వారా 55శాతం విద్యుత్ ఆదా అవుతుంది.
- ఐఎస్ఐ మార్క్ మోటారు పంపుసెట్లు పైపులను మాత్రమే వాడాలి.



విద్యుత్ సబ్ స్టేషన్

ఏ ఉప కరణానికి ఎంత విద్యుత్ కాలుతుందంటే..

విద్యుత్	ఎన్ని వాట్స్	రోజుకు గంట వినియోగిస్తే నెలకు ఖర్చు అయ్యే యూనిట్లు
బల్బు	25	0.75
	40	1.2
	60	1.8
	100	3.0
సీలింగ్ ఫ్యాన్		
36-38 అంగులాలు	50	1.5
56 అంగులాలు	60	1.8
60 అంగులాలు	70	2.1
టేబుల్ ఫ్యాన్	40	1.2
ఇస్త్రీ పెట్టె	550	16.5
	750	22.5
ధోబీ ఇస్త్రీ పెట్టె	1000	30
గీజర్	2000	60
స్టోరేజ్ హీటర్ 1కేవీ	1000	30
1.2కేవీ	1200	36
1.5కేవీ	1500	45
వాషింగ్ మిషన్	200	6
ఏసీ-1టన్	1400	42
ఏసీ-1.5 టన్	1800	54
ఫ్రిజిరేటర్ (చిన్నది)	200	6
పెద్దది	1300	9
టీవీ	150	4.5
వాటర్ పంప్	1హెచ్‌పీ	22

వాడకం పెరిగింది

విద్యుత్ వాడకం జిల్లాలో గణనీయంగా పెరిగింది. ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను అవసరానికి మించి వినియోగిస్తున్నారు. విద్యుత్‌ను పొదుపుగా వాడాలి. అనవసరంగా వినియోగించకూడదు. ఐఎస్ఐ మార్క్ ఉన్న స్టార్ రేటింగ్ విద్యుత్ పరికరాల వాడకం వల్ల వినియోగం తగ్గుతుంది. విద్యుత్ పొదుపుపై వినియోగదారుల్లో అవగాహన కల్పిస్తున్నాం. విద్యుత్ చౌర్యం నిరోధానికి ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నాం.

– జి.రామయ్య, విద్యుత్ ఏఈ, నంద్యాల

వాపును చూసి బలుపనుకోవద్దు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆళ్లగడ్డ: రాష్ట్రంలో జరిగిన 14 ఎమ్మెల్సీ స్థానాల్లో చావుతప్పి కన్ను లొట్టపోయినట్లు కేవలం 3 స్థానాలు గెలిచినంత మాత్రాన టీడీపీ నాయకులు అదే బలుపు అనుకుని వాపును చూసి సంబరాలు జరుపుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీపీ వీరభద్రుడు, ముస్లీం మైనార్టీ నాయకుడు బాబులాల్ ఎద్దేవా చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన 14 ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 11 స్థానాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయబావుటా ఎగురవేసిన సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాయం ఆవరణలో సంబరాలు జరుపుకున్నారు. బాణాసంచా కాల్చి, కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ సేవదల్ జిల్లా అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, ముల్లా జాబిర్, ఫయాజ్, షేక్ షేల్ ఉన్నారు.

4న నంద్యాలకు చాగంటి రాక

నంద్యాల(వ్యవసాయం): ఆధ్యాత్మిక గురువు చాగంటి కోటేశ్వరరావు వచ్చే నెల 4వ తేదీన నంద్యాలకు వస్తున్నారని డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ సహదేవుడు, మధుసూదన్ శనివారం తెలిపారు. 4న సాయంత్రం 5గంటలకు శ్రీమద్‌రామాయణ వైభవం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఇందులో భాగంగా శ్రీరామ జయరామ, జయజయ రామ మంత్రాన్ని ప్రతి ఒక్కరు 108 సార్లు రాసి తీసుకొని రావాల్సిందిగా వారు కోరారు. వాటిని అయోధ్యకు చేరుస్తామని వారు తెలిపారు. యోగా గురువు దామోదర్‌రెడ్డి, రాంప్రసాద్, పడకండ్ల సుబ్రహ్మణ్యం, గోళ్ల సుదర్శనం పాల్గొన్నారు.

నిర్ణీత లక్ష్యాలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ వైకేపీ పీడీ శ్రీధర్ రెడ్డి

నంద్యాల(రూరల్): పొదుపు సంఘాల్లోని మహిళలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల్లో భాగంగా 2022–23కు సంబంధించి నిర్ణీత లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని జిల్లా డీఆర్‌డీఏ వైకేపీ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని ఎంపీడీఓ సమావేశ భవనంలో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ 2022–23కు గాను రూ.811 కోట్లను పొదుపు సంఘాల మహిళకు అందేలా కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే జిల్లాలోని ఏపీఎంలు తమకు కేటాయించిన బ్యాంకు లింకేజీలను వందశాతం పూర్తి చేయడం సంతోషకరమన్నారు. అలాగే పొదుపు మహిళలకు అందించే శ్రీనిధి, ఉన్నతి, వైఎస్సార్ ఆసరా పథకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వారి అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని సూచించారు. గ్రామీణ స్థాయిలో పనిచేసే సీసీలు నూతన సభ్యులను పొదుపు సంఘాల్లో చేర్పించాలని ఆదేశించారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు పొదుపు సంఘాల మహిళలతో గ్రామ సభలు నిర్వహించి అభివృద్ధి వివరాలు సేకరించాలని చెప్పారు. అలాగే ఈనెల 26 నుంచి వచ్చేనెల 5వ తేదీ వరకు ఆసరా ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. శ్రీనిధి డీజీఎం నాగప్రసాద్, ఎల్‌డీఎం సత్యనారాయణ, హార్టికల్చర్ డీడీఓ నాగరాజు, పీడీ కార్యాలయ అధికారులు ఎల్లయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



శ్రీకృష్ణ మందిరంలో హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక పద్మావతినగర్‌లో వెలసిన శ్రీకృష్ణమందిరంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు యాదవ సంఘం ఆధ్వర్యంలో శనివారం రెండవ రోజు వైభవంగా జరిగాయి. వేదపండితులు యాదవల్లి కార్తికేయ శర్మ ఆధ్వర్యంలో ఉదయం ప్రాతఃహకాల పూజలు, 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం హోమాలు, జపాలు, పారాయణం, తదితర కార్యక్రమాలు జరిపించారు. సాయంత్రం నల్లగట్ల వెంకటేశ్వర యాదవ్ ఆధ్వర్యంలో చెక్క భజనతో గ్రామోత్సవం చేపట్టారు. సాయంత్రం టీటీడీ, శ్రీశైలం దేవస్థానం వ్యాఖ్యాత డాక్టర్ దీవీ హయగ్రీవాచార్యులు భగవద్గీత ప్రవచనాలను వినిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



విగ్రహాలకు అభిషేక పూజలు చేస్తున్న దాతలు

పరిహారం అందిస్తాం..ఆందోళన వద్దు



చాగలమర్రిలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి జయదేవ్

ఆళ్లగడ్డ: అకాల వర్షంతో పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించేందుకు కృషి చేస్తున్నామని, ఆందోళన చెందొద్దని జిల్లా వ్యవసాయాధికారి జయదేవ్ తెలిపారు. శనివారం ఆయన చాగలమర్రి, రుద్రవరం, ఉయ్యాలవాడ, ఆళ్లగడ్డ మండలాల్లోని అనేక గ్రామాల్లో అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అకాల వర్షం నియోజకవర్గంలోని అన్నదాలను అతలాకుతలం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వర్షానికి పంట, ధాన్యం నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందేలా నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, సాంకేతిక వ్యవసాయాధికారులు ఆయుబ్ బాషా, ప్రభావతమ్మ ఉన్నారు.

రీ సర్వేతో ఆస్తుల పరిరక్షణ



డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా

నంద్యాల(సిటీ): జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్షతో ఆస్తులను పరిరక్షించవచ్చని మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో జగనన్న భూ హక్కు–భూరక్ష కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పట్టణంలో 47వేల అసెస్మెంట్ల భూయాజమాన్య స్థితిగతులను ఎప్పుడో వంద సంవత్సరాల క్రితం హక్కు పత్రాలను నమోదు చేశారన్నారు. మళ్లీ ఇప్పుడు నంద్యాల పరిధిలో ఉన్న 60 చదరపు కిలోమీటర్ల మేర భూమిని రీ సర్వే చేయనున్నామని చెప్పారు. ఎన్నో సంవత్సరాల తరబడి కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడానికి ప్రభుత్వం చేపడుతున్న బృహత్తర కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూములు, ఆస్తులను గుర్తించి వాటిని పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సర్వే అనంతరం ప్రతి సర్వే నంబర్‌కు సంబంధించిన ఒక పార్సల్ నంబర్‌ను ప్రభుత్వం జారీ చేస్తుందనీ, అందులో హక్కుదారు వివరాలు, సర్వే నంబర్, ల్యాటిట్యూడ్, లాంగిట్యూడ్‌లతో, క్యూ ఆర్ కోడ్‌తో సహా భూ హక్కు పత్రంలో ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ నరసింహ మూర్తి, టౌన్ సర్వేయర్ ఉమామహేశ్వరరావు, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు ఈశ్వరయ్య, శరత్ పాల్గొన్నారు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న శిల్పా భువనేశ్వర్‌రెడ్డి

వెలుగోడు: పట్టణంలోని హజరత్ సయ్యద్ రోఖియా బీ ఉరుసు ఉత్సవాల సందర్భంగా శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సహకారంతో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన (న్యూక్యాటగిరి) పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వరరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ..రోఖియాబీ ఉరుసును స్థానికులు కులమతాలకు అతీతంగా నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఏటా ఉరుసు సందర్భంగా శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఎద్దుల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తూ..రైతులపై ఆయనకు ఉన్న ప్రేమను చాటుతున్నారని తెలిపారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని చెప్పారు. ఈ పోటీల్లో 8 జతలు పాల్గొనగా..పెద్ద కొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి వృషభాలు ప్రథమ స్థానంలో నిలిచాయి. వీటి యజమానికి మొదటి బహుమతిగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సహకారంతో రూ. 50,000 నగదు అందజేశారు. రెండో స్థానంలో కర్ణాటక రాష్ట్రం పలకందొడ్డి గ్రామానికి చెందిన ఖాజాహుస్సేన్ ఎద్దులు నిలువగా రూ.40వేలు, నంద్యాల జిల్లా కానాల గ్రామానికి చెందిన గుండం చెన్నారెడ్డి ఎద్దులు మూడో స్థానంలో రూ. 25వేలు, బేతంచెర్ల మండలం గొర్లగట్టు గ్రామానికి చెందిన గోవర్ధన్‌రెడ్డి ఎద్దుల నాల్గో బహుమతి రూ. 15వేలు, ఇస్కాల గ్రామానికి చెందిన నాగార్జున ఎద్దులకు సంయుక్తంగా ఐదవ బహుమతి రూ. 10వేలు, ఇస్కాల గ్రామానికి చెందిన నాగార్జున, వాహబ్ మియా ఎద్దులకు ఆరోస్థానంలో రూ. 5వేలు అందజేశారు. చాపిరేవుల గ్రామానికి చెందిన ఎర్రమల్ల శేషారెడ్డి ఎద్దులకు కన్సొలేషన్ బహుమతి అందించారు. ఈ పోటీలకు నిర్వాహకులుగా వైఎస్సార్‌సీపీ నాయకులు దేశం తిరుపంరెడ్డి, అంబాల ప్రభాకర్ రెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల జయపాల్ పాల్గొన్నారు.

మెడికల్ హబ్‌గా నంద్యాల



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎంపీ పోచా, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి

నంద్యాల(సిటీ): నంద్యాల మెడికల్ హబ్‌గా మారుతోందని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక పద్మావతినగర్‌లో అత్యాధునిక వసతులతో నిర్మించిన నంద్యాల ఇంటెన్సివ్ ట్రామా కేర్ ఆసుపత్రిని జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ జిల్లాలో అత్యాధునిక వసతులు కల్పిస్తూ అందరికీ అన్ని వేళలా అందుబాటులోకి వైద్యాన్ని తీసుకురావడం హర్షనీయమన్నారు. ఉన్నత స్థాయి సౌకర్యాలతో 24 గంటలు రోగులకు అందుబాటులో ఉంటూ వైద్యాన్ని అందించనున్న ట్రామా కేర్ వైద్యులు డాక్టర్ హరినాథ్‌రెడ్డితో పాటు ఆసుపత్రి వైద్య బృందాన్ని ఆయన అభినందించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నంద్యాలలో అత్యాధునిక వసతులతో 30 పడకల ఐసీయూ సౌకర్యంతో ఆసుపత్రి ఏర్పాటు చేయడం శుభసూచకమన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, వైద్యులు విజయ్‌బాబు, శ్రీధర్‌రెడ్డి, సహదేవుడు, వివేకానందరెడ్డి, ఐఎంఏ నంద్యాల జిల్లా అధ్యక్షుడు జఫ్రుల్లా, దిలీప్‌కుమార్‌రెడ్డి, చరిష్మాబేగం మహ్మద్, రాజశేఖర్, నాగసుమంత్‌రెడ్డి, నాగమణి, వసుధ, ప్రసన్న పాల్గొన్నారు.

వడగండ్ల బాధితులను ఆదుకుంటాం



సీఎంకు పంట నష్టంపై వివరిస్తున్న ఎమ్మెల్సీ గంగుల, ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: వడగండ్లతో పంటలు, ఆస్తులు నష్టపోయిన బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి శనివారం తెలిపారు. నియోజకవర్గంలో గురువారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి చేతికొచ్చే పంట, కోసి ఆరబోసిన ధాన్యానికి తీవ్రంగా నష్టం చేకూరిందని, వందలాది జీవాలు మృత్యువాత పడ్డాయని శనివారం అసెంబ్లీ ఆవరణలో సీఎంను కలిసి వివరించారు.

ప్రాణదానం ట్రస్ట్‌కు విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ప్రాణదానం ట్రస్ట్‌కు శనివారం గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన సామ్రాజ్యం ఆమె తండ్రి జి.లక్ష్మారెడ్డి జ్ఞాపకార్థం రూ.1,00,000 విరాళంగా అందజేశారు. అలాగే ఆమె భర్త ఎం.శంకర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆలయంలో దేవతామూర్తుల విగ్రహములు తయారీకి , శివలింగం ఏర్పాటుకు రూ.1,00,000 విరాళంగా ఇచ్చారు. ఈ విరాళాలను విరాళాల కేంద్రంలో అందజేయగా.. అనంతరం అధికారులు దాతలకు స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

108లో ప్రసవం..తల్లీ బిడ్డ క్షేమం



ఎర్రగుడిదిన్నె వద్ద 108లో ప్రసవం చేసిన దృశ్యం

రుద్రవరం: మండలంలోని ఎర్రగుడిదిన్నెకు చెందిన దేవయాని అనే గర్భిణికి శనివారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి ఫోన్ చేశారు. దీంతో మండల కేంద్రం నుంచి వాహనం గ్రామానికి చేరుకొంది. 108 సిబ్బంది శీను, రాజు గర్భిణినితో పాటు ఆశా కార్యకర్తలతో కలిసి వాహనంలో ఆళ్లగడ్డ ప్రభుత్వాసుపత్రికి బయలుదేరారు. అయితే కొద్ది దూరం వెళ్లగానే నొప్పులు అధికమయ్యాయి. సిబ్బంది వాహనాన్ని పక్కకు నిలిపివేసి ఆశాల సహాయంతో అక్కడే ప్రసవం చేశారు. దేవయాని మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉండటంతో ఆమె కుటుంబసభ్యులు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.తల్లీ బిడ్డను ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

నంద్యాల: ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయుల సంక్షేమానికి, వారి సమస్యల సాధనకు తన వంతు కృషి చేస్తానని నూతన ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన ఎంవీ రామచంద్రారెడ్డిని ఏపీయూఎస్ఎంఏ, పీఆర్‌టీయూ, ఇతర ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని శ్రీసంకల్ప్ పాఠశాలలో సన్మానించి అభినందన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు, ఉపాధ్యాయులు తనకు మద్దతు పలికి విలువైన ఓట్లు వేసి ఘన విజయం అందించారని, వారికి రుణపడి ఉంటానన్నారు. తనపై నమ్మకం ఉంచి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయ సమస్యల సాధనలో చిత్తశుద్ధితో, నిజాయితీతో ఇచ్చిన హామీలను నెరవేరుస్తానని చెప్పారు. ప్రైవేటు విద్యాసంస్థల అధినేతలు సుధాకర్, బాలాజీ, వెంకటస్వామి, పీఆర్‌టీయూ, ఏపీయూఎస్ఎంఏ, సంఘాల నాయకులు వెంకటరాముడు, దస్తగిరి, పక్కీర్‌రెడ్డి, కృష్ణారావు, శ్రీనివాసులు, రమణారెడ్డి, భాస్కరరెడ్డి, ఇసాక్‌వలి, హుసేన్‌బాషా, ఉత్తేజ్ పాల్గొన్నారు.

ఇంకా భయంగానే..



ఆకులు రాలిపోవడంతో మొక్కలకు మిగిలిన మిరపకాయలు

దొర్నిపాడు: గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారు జాము వరకు కురిసిన వడగండ్ల వాన ధాటికి రైతులు దిగుబడులు, చేతికొచ్చిన పంటలు కోల్పోయారు. అక్కడక్కడ ఉన్న వాటిపై ఆశలున్నా.. ఇంకా రెండు రోజుల పాటు వర్షాలు కురిసే సూచన ఉందనే వార్తల నేపథ్యంలో రైతులు భయాందోళన చెందుతున్నారు. పొలాల్లో ఆరబోసిన మిరప పంట ఇంకా నీటి మడుగుల్లోనే ఉంది. గాలి వానకు దిగుబడులు బురదమయమయ్యాయి. దీంతో కాయలను వేరు చేసేందుకు వీలు కుండా పోయింది. ఇలానే ఉంటే కాయలు బూజు పట్టే అవకాశం ఉందని వాపోతున్నారు. అలాగే పెనుగాలులకు మొక్కలకు ఉన్న మిరప, ఆకులు చాలా వరకు నేలవాలాయి. రాలిన కాయలు నీటిలో ఉండటంతో కుళ్లిపోయాయి. చెట్టుకు ఉన్న కాయలు కూడా రంగుమారే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.